వ్యాస కౌముది



**మనభారతం** **డా.వల్లూరుపల్లి శివాజీరావు**

77

**తొలి మాట:** *ప్రపంచ పాఠకులను విశేషంగా ఆకర్షించి, ఆకట్టుకుని, వారిచేత ఆదరించబడుచున్న, అసమాన తెలుగు మాస పత్రిక "**కౌముది**" లో ప్రచురితమైన నా 'మనభారతం' వ్యాసం జనవరి 2010 నుండి డిసెంబర్ 2015 వరకు నిరాటంకంగా 72 నెలలు ప్రచురితమయింది.* కాని సమయాభావం వల్ల జనవరి 2016 నుంచి కొన్ని బాధ్యతలవల్ల ఈ వ్యాసాలు కొనసాగించుటకు వీలు కాలేదు.

*ఇప్పుడు సమయం దొరికినందువల్ల 'కిరణ్ ప్రభ' గారి సమ్మతితో భారత విశేష చరిత్ర ను ప్రతిబింబించే ఈ 'మన భారతం' వ్యాసం ఈ సంచిక ద్వారా ఈ వ్యాసంతో మళ్ళీ కొనసాగిస్తున్నాను.*

# చేజారిన భారతదేశ రత్నరాజములు-6

## చంద్రకావి వజ్రం

## (Pink Diamond/Daryā-ye Nur)



గుంటూరు-కృష్ణా జిల్లాల పరిధిలోని కొల్లూరు-పరిటాల వజ్రాల గనులనుంచి బయల్పడిన మరొక భారత వజ్రరాజం "**చంద్రకావి**" (లేత గులాబి: పింక్) వజ్రం. అదే ప్రపంచ ప్రసిద్ధమైన ఏకైక "పింక్ డైమండ్". "కోహినూర్", నీల వజ్రం (Hope Diamond) వలె ఈ అద్భుతమైన వజ్ర రాజం కూడా కాకతీయ రాజుల స్వాధీనంలో ఉంది.

1303 లో నిరక్షరాస్యుడైన ఢిల్లీ సుల్తాన్ "అల్లాఉద్దీన్ ఖిల్జీ" తన సేనాని "మాలిక్ కాఫుర్" ను ఓరుగల్లును పాలిస్తున్న కాకతీయ చక్రవర్తి 'ప్రతాపరుద్రుడు' మీద దండెత్తి, కాకతీయుల అపారసంపదను దోచుకురమ్మని పంపించాడు. మహా బలవంతులైన కాకతీయ తెలుగు సైనికుల ధాటికి తాళలేక కాఫుర్ ఢిల్లీ పారిపోయాడు.

మాలిక్ కాఫుర్ 1309 లో రెండవ సారి ఓరుగల్లు మీద దండెత్తాడు. నెలల తరబడి జరిగిన మారణ యుద్ధం లో కాఫుర్ సైనికులు జరిపిన విధ్వంసాన్ని భరించలేని కాకతీయ చివరి రాజు 1310 లో ఓటమిని అంగీకరించి, సంధి చేసుకుని, కప్పం కట్టటానికి అంగీకరించి తన అనంత రత్నరాసులను, సంపదను ఈ తురుష్క సేనానికి అప్పగించాడు.

వందలాది బళ్ల మీద ఢిల్లీ కి తరలించి, అల్లాఉద్దీన్ ఖిల్జీ స్వంతమయిన ఈ తెలుగు సంపదలో మన కోహినూర్ వజ్రం తో పాటు (186 కారెట్లు బరువు 36 గ్రాములు; 41.40 x 29.50 x 12.15 mm పరిమాణం) ఉన్న"**చంద్రకావి వజ్రం**" (**Pink Diamond**) కూడా ఉంది. ఆలా తెలుగు వెలుగును భాసించిన ఈ మణి రాజం కూడా మన మన తెలుగు ప్రజల చేతులనుంచి జారిపోయింది శాశ్వతంగా!!

1316లో ఖిల్జీ మరణించిన తరువాత ఈ వజ్రం ఢిల్లీని పాలించిన తుగ్లక్ సామ్రాజ్య సుల్తానుల (ఘియా సుద్దీన్ తుగ్లక్ 1320-1325; మహమ్మద్ బిన్ తుగ్లక్: 1325-1351); ఫిరోజ్ షా తుగ్లక్: 1351-1388; తుగ్లక్ వంశానికి చెందిన ఇతరులు: 1388-1414) పరమయింది. వారి తరువాత వచ్చిన "సయ్యిద్" (Sayyid: 1414-1451), "లోధి" (Lodhi: 1451-1526) వంశపు సుల్తానుల ఆధీనంలో ఉంది చంద్రకావి వజ్రం.

చివరి లోధి సుల్తాన్ "ఇబ్రహీం లోధి" ఈవజ్రాన్ని ఆగ్రాను పాలించే హిందూ రాజు "విక్రమాదిత్య", మొఘల్ సుల్తానులు "బాబర్", "హుమాయూన్" ల వద్దకు చేరింది. 1541 మే నెలలో హుమాయూన్ "షేర్ షా సురి" (Sher Shah Suri) చేతిలో ఓడి పర్షియా (Iran) పారిపోయి అచ్చటి పాలకుడు "షా తమస్ప్" (Shah Tahmasp-1) అతిథిగా తలదాచుకున్నాడు.

తన దిల్లీ సింహాసనం తిరిగి స్వాధీనం చేసుకోటానికి హుమాయూన్ పర్షియా రాజు సహాయంతో 12,000 మంది సుక్షితులైన, అశ్వారూఢులైన సైనికులను ఏర్పరచుకున్నాడు. ఈ సహాయానికి ప్రతిఫలంగా "షా తమస్ప్" కు హుమాయూన్ తన వద్దనున్న కోహినూర్ వజ్రంతో పాటు చంద్రకావి వజ్రాన్ని కూడా బహుమతిగా సమర్పించుకున్నాడు. పర్షియన్ రాజు తన బంధువు, ఇప్పటి మహారాష్ట్ర లోని అహ్మద్ నగర్ సుల్తాన్ "బర్హాన్ నిజాం షా 1" (Barhan Nizam Shah 1) కు 1552 లో కానుకగా పంపించాడు.

గోలుకొండ సుల్తానులకు చంద్రకావి వజ్రం ఎప్పుడు లభించిందో కాని, 1650వ దశకంలో ఇది అప్పటి సుల్తాన్ "అబ్దుల్లా కుతుబ్ షా" (Abdulla Qtub Shah) వద్ద ఉంది. ఈయన వద్ద ఒక వ్యాపారి "మీర్ జుమ్లా" (Mir Jumla) చాలా నమ్మకమైన వజ్రాల నైపుణ్యుడిగా స్థిరపడ్డాడు. ఈనమ్మకాన్ని ఇతను వమ్ముజేసి గోలుకొండ ఖజానా నుంచి అనేక రత్నాలను దొంగిలించి వాటిని 1656లో ఆగ్రాలోని మొగల్ సుల్తాన్ "షా జహాన్" (Shah Jahan) కు సమర్పించాడు. వీటిల్లో చంద్రకావి వజ్రం కూడా ఉంది.

1659లో "ఔరంగ్ జేబ్" (Aurang Zeb) తండ్రి షా జహాన్ ను కారాగారంలో బంధించి చంద్రకావితో సహా అనేక రత్నాలకు యజమాని అయ్యాడు. అప్పటి నుంచి 80 ఏళ్ళు ఈ వజ్రం మొగల్ సుల్తానుల వద్దనే ఉంది.

1739లో పర్షియన్ పాలకుడు "నాదిర్ షా" (Nadir Shah) అప్పటి దిల్లీ మొగల్ సుల్తాన్ "మహమ్మద్ షా" (Muhammad Shah) ను ఓడించాడు. ఇరువురి మధ్య జరిగిన సంధి ఒడంబడికలో భాగంగా దిల్లీ సుల్తాన్ తన నెమలి సింహాసనం (Peacock Throne) తో పాటు వజ్రాలను కూడా విజేత నాదిర్ షా కు సమర్పించు కున్నాడు. వీటిల్లో పింక్ వజ్రం కూడా ఉంది. ఈ విధంగా మన కొల్లూరు-పరిటాల వజ్రం రెండవ సారి, అది కూడా శాశ్వతంగా, చేజారిపోయింది.

దీనితో పాటు 7 సంవత్సరాల కృషితో వజ్రాలు, ముత్యాలతో పొదగబడి, బంగారంతో నిర్మితమై 1635 లో షా జహాన్ చేత ఆవిష్కరించబడిన "నెమలి సింహాసనం" కూడా నాదర్ షా పరం అయి, పర్షియా చేరింది. పర్షియా (ఇరాన్)లో చంద్రకావి వజ్రం చంద్రకావి వజ్రపు అసమానమైన కాంతిని చూసి నాదర షా దీనికి పర్షియన్ భాషలో "**Daryā-ye Nur**" ("సముద్రమంత కాంతి" ని వెదజల్లే వజ్రం; "the Sea of Light") అని నామకరణం చేసాడు. 1747 లో నాదర్ షా హత్యచేయబడిన తరువాత ఈ వజ్రం అతని సేనాపతి, Kharosan ప్రాంతానికి "వైస్రాయి" (Viceroy) అయిన "ఆలం ఖాన్ ఆరబ్" స్వాధీనమయింది. (ఆకాలంలోఉత్తర, వాయువ్య ఆఫ్గనిస్తాన్, ఈశాన్య ఇరాన్, దక్షిణ టార్కెమిస్తాన్-ఉజ్బెకిస్తాన్ ప్రాంతానికి ఆ రోజుల్లో Kharosan అనే పేరు ఉండేది).

కాని ఆలం ఖాన్ ఆరబ్ ఇరాన్ ను పాలించిన మొదటి Qajar వంశపు సుల్తాన్ "Mohammad Hasan Khan" కు Daryā-ye Nur ను బహూకరించాడు. 1759 లో ఈయన Zand వంశపు వ్యవస్థాపకుడు, రాజకీయ ప్రత్యర్థి "ముహమ్మద్ కరీం ఖాన్" తో జరిగిన యుద్ధంలో మరణించాడు. తత్ఫలితంగా మన చంద్రకావి వజ్రానికి కరీం ఖాన్ క్రొత్త యజమానిఅయ్యాడు.

1779 లో కరీం ఖాన్ మరణించిన తరువాత Zand సామ్రాజ్యం బలహీనపడి, ఆర్థికంగా చితికిపోయింది. ఈయన మనుమడు "Lotf 'Ali khan" పాలనా కాలంలో Harford Jones అనే బ్రిటిష్ వజ్రాల వ్యాపారి ద్వారా పింక్ వజ్రాన్ని అమ్మటానికి ప్రయత్నించాడు. ఎక్కువ ధర వస్తుందనే కారణంతో ఈ వజ్రాన్ని కొంతవరకు కోసి దాని కాంతిని పెంచాలని వజ్రాల వ్యాపారిని కోరాడు.

కాని ఇదిజరిగే లోపలే కరీం ఖాన్ జైలులో బంధించబడ్డాడు. వెంటనే చంద్రకావి వజ్రం Qajar వంశపు నవాబు "Aqa Mohammad Khan" చేతిలోకి వెళ్ళింది. అయితే ఇతని సేవకులు ఈయనను 1797 లో హత్య చేశారు. ఈ సేవకులు అనేక వజ్రాలతో పాటు ఈ వజ్రాన్ని కూడా

Khurdish Emir: “Sādeq Khan Shaqaqi” కు సమర్పించి తమకు రక్షణ కోరారు. ఈయన Azerbaijan క్రొత్త నవాబు “FathʿAli Shah” కు వీటిని సమర్పిం చాడు.

1834 లో Fathʿ Ali Shah పింక్ వజ్రం మీద తన పేరుతో పాటు “Lord of the (Auspicious) Conjunction” అనే బిరుదును పర్షియన్ భాషలో చెక్కించాడు. ఫలితంగా అంతవరకు వన్నా ఈ వజ్రపు ధర 200,000 (2 లక్షల) పౌండ్లు సగానికి పడిపోయింది. 1834 లో ఈయన మరణ సమయం లో Daryā-ye Nur వజ్రాన్ని చూస్తూ ప్రాణం వదిలాడు!!

ఆ తరువాత వచ్చిన Qajar వంశపు సుల్తాన్ “Naser al-Din Shah” చంద్రకావి వజ్రానికి వైద్య, తాంత్రిక గుణాలున్నాయని భావించి దీని రక్షణకు కొంతమంది నమ్మకమైన సేవకులను నియమించాడు. ఒకసారి అయన స్నానం చేస్తున్నపుడు ఈ వజ్రం చేతిలో నుంచి జారిపోయినప్పుడు మూడు రోజులు చాలా మానసికంగా బాధపడ్డాడు. ఒకసారి కొన్ని వజ్రాలు దొంగిచబడినప్పుడు Daryā-ye Nur వజ్రాన్ని ఒక ఇనుప పెట్టిలో ఉంచి, ఈ పెట్టెను Naser al-Din Shah తన సింహాసనం క్రింద దాచి భద్రపరిచాడు.

Qajar నవాబుల పరిపాలనాకాలంలో వజ్ర వైడూర్యాలు, నగలు, అనేక విలువైన వస్తువులను ధరిం చటం, ప్రదర్శించుకోవటం ద్వారా వారు ప్రజలలో దైవ సంభూతులనే భావన కలిగించారు. Naser al-Din Shah వీటిల్లో అత్యంత విలువైన వాటిని ధరించటమే గాక, యూరోపు నుంచి 'టెహ్రాన్' వచ్చిన సందర్శకులకు ఘనంగా చూపించేవారు. వీటిల్లో Daryā-ye Nur వజ్రం తప్పని సరిగా ఉండేది.

ఇతని తరువాత 1896 లో వచ్చిన నవాబు “Mozaffar al-Din Shah” కూడా ఇదే సాంప్రదాయాన్ని కొనసాగించాడు. 1909 లో వచ్చిన రాజ్యాంగ విప్లవంలో విప్లవ నాయకుడు “Mohammad ʿAli Shah” Qajar నవాబుల కిరీటపు వజ్రాలన్నిటినీ యూరోపుకు తీసుకువెళ్ళాలనే దుర్బుద్ధితో కొన్ని రోజులు రష్యన్ రాయబారి భవనంలో తలదాచుకున్నాడు. చివరకు రాజ్యాంగ నాయకులు ఈతనికి 15,000 పౌండ్లు చెల్లించి ఈ వజ్రాలను
స్వాధీనం చేసుకుని ఇవి ఇరాన్ దేశంలోనే ఉండేటట్లు చేశారు. ఈ వజ్రాల నగలలో చంద్రకావి వజ్రం కూడా ప్రముఖంగా ఉంది.

1931లో Shah నవాబులు ఈ వజ్రాల నగలను ధరించటం నిషేధించడం జరిగింది. వెంటనే ఈ పింక్ వజ్రంతో సహా అనేక వజ్రాలను కుదువ బెట్టి అప్పు తెచ్చుకోవడానికి ఉపయోగించారు. 1960 లో ఇరాన్ Central Bank వీటిని స్వాధీనపరచుకుని తనవద్దే ఉంచుకుంది. ఇప్పటికీ పింక్ వజ్రం అక్కడే ఉంది.

కొల్లూరు జంట వజ్రాలైన కోహినూర్-చంద్రకావి లలో కోహినూర్ రెండు ముక్కలుగా కత్తిరించబడి ఒకటి బ్రిటిష్ రాణి కిరీటాన్ని అలంకరిస్తే, మరొకటి బ్రిటిష్ మ్యూజియంలో సందర్శకులను అలరారిస్తుంటే, చంద్రకావి ఇరాన్ Central Bank లో ఖజానా భద్రంగా దాచిపెట్టబడింది

(కొనసాగింపు వచ్చేనెలలో)

**మీ అభిప్రాయాలను పంపించేందుకు నా ఇ-మెయిల్: dr_vs_rao@yahoo.com**

COMMENTS